# అయ్యప్ప భక్తులకు టోల్‌గేట్ వద్దు
# కేరళ హైకోర్టు ఉత్తర్వులు

కొచ్చి, నవంబర్ 25: శబరిమల అయ్యప్పస్వామిని దర్శించుకోడానికి భక్తులు వచ్చే వాహనాల నుంచి టోల్‌గేటు రుసుము వసూలు చేయడానికి వీల్లే దనికేరళ హైకోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ టి.బి. రాధాకృష్ణన్, జస్టిస్ సి.టి. రవికుమార్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఈ ఉత్తర్వులిచ్చింది. అయితే, ట్రావన్‌కూర్ దేవస్వోం బోర్డు (టీడీబీ) తన పరిధిలోని భూభాగంలో పార్కింగ్ ఫీజు వసూలు చేసుకోడానికి మాత్రం ఎలాంటి అడ్డంకి లేదని స్పష్టం చేసింది. పార్కింగ్ స్థలంలోనే తప్ప వచ్చే మార్గాల్లో వసూళ్లు ఉండరాదని తెలిపింది. ఆలయానికి సంబంధించిన వివిధ అంశాలపై శబరిమల ప్రత్యేక కమిషనర్ ఇచ్చిన నివేదిక నేపథ్యంలో కోర్టు ఈ ఉత్తర్వులిచ్చింది.

**పూజారి కుమారుడికి అనుమతి లేదు**

శబరిమల ఆలయంలో స్వామికి పూజాదికాలు చేయడంలో తనకు తన కుమారుడు కండరారు మోహనారారును అనుమతించాలంటూ శబరిమల సీనియర్ పూజారి కండరారు మహేశ్వరారు చేసిన విజ్ఞప్తి నికేరళ హైకోర్టు తిరస్కరించింది. రెండు నెలల పాటు జరిగే పూజాదికాలు ఇప్పటికే ప్రారంభమైనందున చాలా ఆలస్యమైందని జస్టిస్ టి.బి. రాధాకృష్ణన్, జస్టిస్ సి.టి. రవికుమార్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఈ సందర్భంగా తెలిపింది. అయితే, ఇతరుల నుంచి సాయం తీసుకోవచ్చని పూజారికి బెంచ్ తెలిపింది.